సౌందర్యపిపాస

శ్రీ కుందుర్తి నరసింహారావుగారు

●

"ఛీ! నేనింకనైనా ఒక నిర్ణయం మీద నిలిచివుండాలి. ఈ చాంచల్యం యేమిటి?

"సౌందర్యపిపాసచేత పిచ్చివాడినే అయినా సనుకో. పెళ్లిచేసుకున్న భార్యతో నీవు నాకువద్దు అని స్పష్టంగా చెప్పి పంపించివేశాను. ఇంక మళ్లీ దాన్ని తలచుకోటం బలహీనతకాదా? ఈసారి ఆ తలపు వస్తే ఆత్మహత్య చేసుకుంటాను" అనుకుని వూరుకునేవాడు.

●

ఆనాడు లేచినంత పెందలాడి భుజంగరావు ఎన్నడూ లేచి యెరగడు. మనస్సులో యేదో ఒక వింత ఆవేదన బయలుదేరినట్లుగా తోచింది. అది విచారమని గానీ ఆపుర్దా అనిగాని నిర్ణయించటానికి వీల్లేకుండా వుంది.

పక్కమీద కూచొని కిటికీలోనుండా బైటికి చూచాడు. ఇంకా సూర్యోదయమైనట్లు లేదు. పాలవాళ్లు ఆవులను తోలుకువచ్చి అక్కడక్కడ వాకిళ్ల ముందునుంచొని కేకలు వేస్తున్నారు. ఆశ్చర్యంతో అతడు "నేనురాత్రి నిద్రపోయినానా, మేలుకొనే పడుకున్నానా?" అనుకున్నాడు.

పనిచేసే మనిషివచ్చి "అమ్మగారూ" అని పిలవటం వినబడ్డది. అతని తలమీద ఒక ముష్టిఘాతము తగిలినట్టుగా తోచింది. ఏదో యోచనలో పడ్డాడు. "అమ్మగారులేదు" అని దానికి చెప్పాలా?...... ఉంటే యెంత బాగుండేది? వెంటనే లేచిపోయి తలుపుతీసి నిశ్శబ్దంగా పనులన్నీ చేయించుకొనేది. తననిద్రకు భంగంవస్తుందేమోనని పనిమనిషిని రెండో కేక వెయ్యనియ్యకుండా మరివొకమాటైనా బిగ్గరగా మాట్లాడనీయకుండా జాగ్రత్తపడేది. తనకు వేన్నీళ్లు తయారై, పాలు కాగి సిద్ధముగా వున్నతరువాత, మెల్లిగా పక్కదగ్గరకువచ్చి "యెనిమిది గంటలైందండీ" అనేది. అప్పుడు తను నిద్రలేచేవాడు. ఇవ్వాళో......?

"అమ్మగారూ" అని పనిమనిషి మళ్లీ పిలవటం వినబడ్డది. అతడు కిటికీలోనించీ వాకిటివంక చూచాడు. "నాకింకా పిచ్చి వదలలేదు," అనుకొని చివాలున లేచిపోయి తలుపుతీశాడు.

౨

హోటలులో ఆవాళ మెతుకులు సయించలేదు. ఎంత వద్దని మరల్చుకుంటున్నా మనస్సు భార్యమీది ఆలోచనను వదలిపెట్టటంలేదు. "ఇష్టంలేక పంపించివేసిన భార్యమీద ఇంకా ఆలోచన యెందుకు?" అని ప్రశ్నించుకుంటాడు. జవాబు సులభంగా దొరకదు. ఒకవేళ తనమనస్సే తనను మోసంచేస్తున్నదేమో! ఆ అయిదు నెలలూ కాపరం చేయటంవల్ల తన హృదయంలో నిజమైన ప్రేమాంకురాలు యేర్పడ్డవేమో! అవి తాను గుర్తింప గలిగేటంత పెద్దవిగా పెరగకముందే తాను భార్యను పరిత్యజించాడేమో! అందువల్లనే అంత కంగారుగా వున్నదేమో! ఇక ఆ అంకురాలను పెల్లగించివెయ్యటానికి వీలులేదేమో! ఏమో......

ఎట్లాగో భోజనము ముగించి ఆఫీసులో పడ్డాడు. కాని ఆవేళ ఎవరితోనూ సరిగా మాట్లాడ బుద్ధి పుట్టలేదు. పనియేమీచేయ బుద్ధిపుట్టలేదు. కాగితం మీద కలం పెట్టినప్పటినుంచీ మనస్సు చలించటం

మొదలుపెట్టింది. తన ముఖవైఖరి చూసి తోటివాళ్లే మైనా అనుకుంటారేమో నని మనస్సును బిగ్గబట్టుకోటానికి ప్రయత్నిస్తాడు. అయిదునిమిషాలు నెగ్గుతాడు. తరవాత ఓడిపోతాడు.

ఆలోచనలు పరిగెత్తుతుంటూ వస్తవి. "ఒక్కతే రైలుమీదబడి యింతదూరం వచ్చిందని వాళ్లనాన్న దాన్ని కోప్పడతాడేమో! పడడూమరి? తానుపోయి దింపిరాగూడదూ?

"తాను తీసుకుపోయి దింపివచ్చేటంత ఆపేక్షే వుంటే అసలు పుట్టింటికి పంపట మెందుకూ?....

"అది, పాపం, తండ్రిమాటలకు చిన్నబుచ్చుకుని యేడుస్తుందేమో! ఇక్కడ యెంతగా యేడ్చింది! కళ్లువాచిపోయి మొగమంతా యెర్రబడినట్లు కనిపించింది. ఆనల్లటి చెక్కులమీద కన్నీరుచారలు పడిపోయినట్లు కనిపించింది. ఆ ముఖవైఖరి తలచుకుంటే తనకిప్పుడుకూడా గుండె పగిలిపోతుంది.

అయినా, ఛీ! అంత నల్లని......"

3

రోజులు గడిచినకొద్దీ మనస్సు క్రమక్రమంగా శాంతిపొందింది. జానకిమాటలు, యేడుపు, జాలిగొలిపే చూపులు, అన్నీ మరచిపోతున్నాడు. అప్పుడప్పుడు సాయంత్రం ఆఫీసునుంచీ ఇంటికి చేరుకోగానే మళ్లీ జ్ఞాపకమొస్తూ వుండేది. దీపంవెలిగించి పత్రిక చేత్తో పట్టుకుని కొంచెం ఆలోచించేవాడు. కాని అందులో "మెట్రిమోనియల్" ప్రకటనలు చూచేటప్పటికి మనస్సు వేరేత్రోవ పట్టేది.

"ఛీ! నేనింకనైనా ఒక నిర్ణయంమీద నిలిచి వుండాలి. ఈ చాంచల్యం యేమిటి?

"సౌందర్యపిపాసచేత పిచ్చివాడినే అయినా ననుకో. పెళ్లిచేసుకున్న భార్యతో నీవు నాకువద్దు, అని స్పష్టంగా చెప్పి పంపించివేశాను. ఇంక మళ్లీ దాన్ని తలచుకోటం బలహీనతకాదా? ఈసారి ఆతలపువస్తే ఆత్మహత్య చేసుకుంటాను," అనుకుని వూరుకునేవాడు.

ఒకనాడు అకస్మాత్తుగా భార్యదగ్గరనుంచీ వుత్తరం వచ్చింది. అంత పని జరుగుతుందని తను ఎన్నడూ అనుకోలేదు. తను మరచిపోయినట్లు ఆమె మాత్రం యింకా మరచిపోలేదన్నమాట. అంత స్పష్టంగా చెప్పివేసినా ఆమెకుమాత్రం యింకా తన మీద విశ్వాసం పోలేదన్నమాట. ఆమె యిప్పటికీ, తన తల్లిదండ్రులు సోదరీ సోదరులమధ్య వుంటున్నప్పటికీ తననేగూర్చి యోచిస్తూ వుందన్నమాట. ఎప్పటికైనా తనువచ్చి మళ్లీ తీసుకు పోతాడనీ తనదగ్గరే సుఖంగా కాపరం చెయ్యగలుగుతాననీ ఆమె ఆశ పెట్టుకుని వుందన్నమాట! నిజంగా అట్లా వుంటుందా?

ఎందుకు వుండదు? ఆమె తప్పేమీ లేకపోయె!

ఉత్తరంలో రెండేముక్కలు: "మానాన్న వుండి వుండి వూరికే విసుక్కుంటూ కోప్పడుతూ వున్నాడు. వెంటనే మీరువచ్చి తీసుకొని పోవలెను."

౪

భుజంగరావు ఉత్తరానికి జవాబు రాయలేదు. పైగా దానివల్ల అతనిధైర్యం మరింత జాస్తి అయింది. "నన్ను మరచిపో" అనిచెప్పి పంపించిన తరవాత ఆమాట లక్ష్యంచేయక ఇంకా తనకు ఉత్తరం రాస్తుందా? అట్లా ధిక్కరించినదానిని ఇంకా తలచుకోవటమా? అని కోపం తెచ్చుకున్నాడు.

వెంటనే, "నాకువద్దన్న తర్వాత యింకా ఆమె నా ఆజ్ఞయెందుకు పాలించాలి?" అని ప్రశ్నించుకున్నాడు.

"పాలించ దలచుకోకపోతే మళ్లీ నాదగ్గరికేవచ్చి యెందుకు వుంటానని రాయాలి? నాకుభార్యగా వుండ దలచుకుంటే నేను చెప్పినట్లు చెయ్యవద్దూ?

"వుండక యేంచేస్తుంది? చస్తుందా అగ్నిసాక్షిగా పెండ్లిచేసుకున్న భార్య?"

"నేను రాక్షసుణ్ణిరా!" అని ఒక నిట్టూర్పువిడిచి ఆ యోచన బలవంతంగా వదలిపెట్టుకున్నాడు.

ఇంచుమించు యేడాది గడిచింది. ఉండలేక పోయినాడు. ఏమీ తోచిందికాదు. "ఆ నల్లని భార్యనే మళ్లీ తెచ్చుకుందామా?" అనుకున్నాడు.

"నేనువెళ్లి పిలిస్తే వస్తుందా? వాళ్లనాన్న వొప్పుకుంటాడా? వాళ్ల నాన్నకేముంది? లేక యెవరిదుంది, యేడాదిబట్టీ పెట్టి పోషిస్తున్న వాడిదికాక...

"ఛీ! నేనింత పశువునా? నిజమైన ప్రేమ ఆ కురూపిమీద నాకెన్నడూ కలగదుగదా. ఇదివరకెంత ప్రయత్నించలేదు? విఫలయత్నుణ్ణే అయినానుకదా? ప్రేమలేకుండా దానితో కాపరం చెయ్యటం యెందుకూ? ఇప్పుడు నేను కావాలంటుంది యెందుకో నాకు తెలుసు......ఛీఛీ! నావంటివాడు మృగంకంటే హీనంగా మారుతాడా? ఎన్నడూ జరుగదు. నాప్రాణం యివ్వటానికి సిద్ధంగావుండే అంతప్రేమ యేస్త్రీమీద నాకు కలుగుతుందో ఆమెతోనే నేను కాపరం చేస్తాను.

"పోనీ, అట్లాంటిప్రేమ కలిగించగల మరివొక స్త్రీని, నాకునచ్చిన సౌందర్యవతిని యెందుకు పెండ్లి చేసుకోకూడదు?"

ఆరాత్రల్లా నిద్రపోకుండా ఆలోచించాడు. రెండు మూడు రోజులు పత్రికలలో ప్రకటనలు జాగ్రత్తగా పరిశీలించి రెండు మూడింటికి జవాబులు పంపాడు.

౫

ఆఫీసులో పనిచేసుకుంటూవుండగా ఒక యాభైయేండ్ల పెద్దమనిషి యెవరోవచ్చి "మీరేనా భుజంగరావుగారు? అని అడిగాడు. అప్పుడే అతనికి భోధపడింది. "అవును. ఏం" అన్నాడు.

పెద్దమనిషి జేబులోనించీ ఒక కాగితం తీసి "ఇది మీరేనా రాసింది?" అని అడిగాడు.

అదిఒక "మెట్రిమోనియల్" ప్రకటనకు భుజంగరావు రాసిన జవాబు. దానివంకా ఆ పెద్దమనిషి వంకా ఎగాదిగాచూచి "అవునండి, ఇవతలికిరండి మాట్లాడుదాం" అని ఆయనను వేరే ఒక ఖాళీ గది లోకి తీసుకెళ్లాడు.

"అయితే మీకేమీ అభ్యంతరంలేదుగద?" అన్నాడాయన.

భుజంగరావు కనుబొమలు చిట్లించి, "వితంతువని నాకేమీ ఆటంకంలేదు. మీ అమ్మాయేనా?" అన్నాడు.

"అవును. మరిమీవాళ్లు ఒప్పుకుంటారండీ?"

"మావాళ్లెవరూ ఈ సంగతిగూర్చి ఆలోచించక్కరలేదు."

"మరి పెండ్లికెవరూ రారా?"

"ఉఁ హుఁ."

పెద్దమనిషి మాట్లాడకుండా అతనివంక చూడటం మొదలు పెట్టాడు.

"అయితే బాలవి...." అని భుజంగరావు అడగబోగా ఆయన "అవును కార్యం కాకముందే వాడు పోయినాడండీ."

౬

పిల్ల బాగానేవుంది. కాని పదిహేనేళ్లంటే అంతగా నమ్మదగినట్లు కనబడలేదు. భుజంగరావు కొంత ఆలోచించాడు. "అయినా అన్నీ కావాలంటే యెట్లా వస్తవి?" అనుకున్నాడు. పిల్ల మరీ పెద్దదే అని యేదో ఒకవింత సంకోచం తోచింది అతనికి. కాని తను కోరుతున్నది చక్కని రూపం కదా. అది లభించింది. అతని కాంక్షావేగము కొంత

శమించినట్లుగా తోచింది. ఎన్నడూ యెరగని ఆనందాంకుర మేదో మనస్సులో మొలకెత్తిన ట్లనిపించింది. "ఇది నాదే" అనుకున్నాడు.

"రేపు మీరు మా యింటివైపు ఒకసారివస్తే నిర్ధారణగా చెప్పివేస్తాను" అని ఆ పెద్దమనిషితో చెప్పి ఆఫీసుకు వెళ్లిపోయినాడు.

ఆనాడతని మొగము మీదేదో వింతకళ ఒకటి కనబడివుంటుంది. ఆఫీసులోనివాళ్లంతా అతనివంక విచిత్రంగా చూడటం మొదలుపెట్టారు. ఇంటిదగ్గర కూడా చూచినవా ళ్లేదో ఆశ్చర్యం వెలిపుచ్చే చూపులతో పలకరించారు. "ఏం అట్లావున్నావు?" అనికూడా ఒకరిద్దరు అడిగారు. కాని అత నేమీ జవాబియ్యలేదు. "ఒంట్లో బాగాలేదుట్రా?" అని ఒక స్నేహితు డడిగాడు.

భుజంగరావు "ఏం? బాగానేవుందే!" అని అతణ్ణి తప్పించుకుని పోబోయినాడు.

స్నేహితు డంతటితో వూరుకోక "వియోగం అనుభవిస్తున్నావా?" అని మెల్లగా అంటించాడు.

భుజంగరావు అతనివంక చురచురా చూచి దూరంగా వెళ్లిపోయినాడు. కాని ఆమాట అతని మనసులో అంటుకుపోయింది. మొదట "ఈ వెధవలకందరకూ నా సంగతి యెందుకు?" అనుకున్నాడు. కాని మనస్సు ఆగలేదు. "వీళ్లందరకూ తెలేని దేముంది? ఊరుకుంటారా మరి? నాతో అనకపోతే మటుకు వాళ్లల్లో వాళ్లనుకోరూ? భార్యను వదిలిపెట్టాడనే అప్రతిష్ఠ రాకుండాపోతుందా? అందులో జానకివంటి యేతప్పూ చేయనిదాన్ని.........

"ఛీ! నాకు మళ్లీ పిచ్చి యెత్తుతూవుంది. నా ఆకాంక్ష తీరవద్దా? నాకు సంతృప్తి కలుగవద్దా?...

"నా సంతృప్తిని యెవరు గణిస్తారు? ఒక ప్రాణిని అన్యాయంగా కష్టపెట్టాననే చెడుపేరే చెప్పుకుంటారు గాని.........

"వాళ్లు చెప్పుకుంటే యేమి? వాళ్లతో నాకేమి? ......"

౭

ఆరాత్రి చాలాదీర్ఘంగా తోచింది అతనికి. జీవితములో యెన్నడూరాని ఒక క్రొత్త అనుభవ మేదో ఆనాడు వచ్చినట్లుగావున్నది. స్నేహితులను లోకులనుగూర్చి అత డంతగా యెన్నడూ ఆలోచించి యెరగడు. తన అంతరాత్మకంటెగూడా వాళ్లు బలవంతులుగా కనబడుతున్నా రప్పుడు. నిద్దురరాక పక్కమీదలేచి కూచున్నాడు. రాత్రి ఒంటిగంట అయిందేమో. కిటికీలోనించి ఆకాశంవంక చూచాడు. చీకటిలో ఒక్కొక్క నక్షత్రమూ తనను వెక్కిరిస్తున్నట్టుగా తోచింది.

"ఇప్పుడే ఇంతగావుంది, మళ్లీ పెళ్లిచేసుకుంటే యిక వూరుకుంటారా? ఎంత పరిహాసమో......

"అయినా, యెవరికీ తెలీకుండా చేసుకుంటాను. జానకినే మళ్లీ తెచ్చుకున్నట్టుగా పైకి కనబడేటట్టు చేస్తాను......

"లోకం కండ్లు యెన్నాళ్లు మాయగలము?.....

"జానకి యేమౌతుంది? అది సంపాయించుకోలేదు గదా? పెద్దదై తండ్రియింట్లోవుంటే దాన్ని కూడా లోకులు నన్నన్నట్లే యేమేమి అంటారో!... ఛీ, దానిమీదాగూడా చెడుమాటలు చెప్పుకుంటారా? ఎన్నటికీ జరగదు......

"నేను పెండ్లి చేసుకున్నానని తెలిస్తే అది యేమనుకుంటుందో! ఇక్కడికి వస్తుందేమో! అప్పుడు ఇది యేమౌతుంది? మోసంచేశానని తెలిస్తే ఊరుకుంటుందా? గోలచేస్తే? వీళ్ల నాన్న వూరుకుంటాడా? వాడు వూరుకుంటాడా? ఆఫీసుకు వస్తే!......"

అప్రయత్నంగా అతడు పక్కమీద పడిపోయినాడు.

౮

మరునాడు పెద్దమనిషి వచ్చేటప్పటికి భుజంగరావు పడకకుర్చీమీద కూర్చొని చదువుకుంటున్నాడు. ఆయనవంక చూచి పలకరించనైనా లేదు. ఆయన నిర్ఘాంతపోయినాడు.

కొంచెంసేపు తలవంచుకొనేవుండి "నేను చాలా పనిమీదవున్నానండీ" అన్నాడు భుజంగరావు. ఆయన నొచ్చుకుని "అయితే మీ ఉద్దేశం యెట్లా వుందో చెప్పేసెయ్యండి" అని ఖచ్చితంగా అన్నాడు.

భుజంగరావు తలయెత్తకుండానే "మీరు వేరే విచారించుకుంటే మంచిది" అన్నాడు.

పెద్దమనిషి తిరిగిచూడకుండా వెళ్లిపోయినాడు.

ఆనాటినుంచీ భుజంగరావులో క్రొత్తమార్పు వచ్చింది. మనస్సును సంపూర్ణంగా వశంచేసుకొని ఆఫీసుపనిమీదే సర్వశక్తులూ కేంద్రీకరించి ఉపయోగిద్దామని ప్రయత్నంసాగించాడు. స్వసుఖమనే ఆలోచనే రానీయకుండా వుందామని.

ఇంటిగోడలమీద అందమైన పటాలన్నీ తీసి పెట్టెలో దాచేశాడు. రోజూ చేతిలో ఎంత డబ్బు ఖర్చవుతుందో వ్రాసుకోటం మానేశాడు. ఆహారం యెంతైనా ఆలోచనలేకుండా యెప్పుడుపడితే అప్పుడు తినటం. ఇతరులతో రాజకీయవిషయాలూ ఆఫీసువిషయాలూ తప్ప మరేమీ మాట్లాడడు.

౯

మరి మూడునెలలు గడిచినవి. జానకిమాత్రం అప్పుడప్పుడు జ్ఞాపకంవచ్చేదే కాని అంతగా మనస్సును బాధించేదిగాదు. తనలోతానే కొంచెంగా నవ్వుకుని పూరుకుంటుండేవాడు.

ఒకనాడు ఆఫీసులోవుండగా బండిమనిషి ఎవడో వచ్చి తన పేరుగల చీటీ నొకటి తెచ్చియిచ్చాడు. ఆశ్చర్యపడి "ఏమిటిది?" అన్నాడు.

"మీ బంధువులటండీ రైలుదగ్గర వున్నారు. మిమ్మల్ని రమ్మన్నారు" అన్నాడు బండివాడు.

"ఎవరు?"

"ఆడవాళ్లండీ......"

అదిరిపడి భుజంగరావు మేనేజరుతో "ఇప్పుడే వస్తా"నని చెప్పి బండివాడితో రైలుదగ్గిరికి వెంటనే వెళ్లాడు. గేటుదగ్గర ఒకపక్కగా నిలబడ్డ బండిలో జానకి కూర్చొనివుంది. భుజంగరావుకు కోపం వచ్చింది. కాని అక్కడ యేమీ అనగూడదనుకున్నాడు. వెంటనే బండిని తన యింటిదాకా తోలించుకుపోయినాడు.

బండివాడు పెట్టెను వసారాలో పెట్టి భుజంగరావువంక చూడగా జానకి తన కొంగుముడివిప్పి తానే వాడికి డబ్బిచ్చి పంపివేసింది.

భార్య నేదో అడగాలని అనుకున్నాడు మొదట. కాని మళ్లీ మాట్లాడ బుద్ధిపుట్టలేదు. ఇంట్లోకి బయటికి యేదో పనివున్నట్టుగా ఒకసారి తిరిగాడు.

"మళ్లీ ఆఫీసుకు వెళ్తారా యిప్పుడే?" అన్నది జానకి నిర్భయంగా.

ఆశ్చర్యమూ కోపమూ అతడ్ని మింగివేసినవి. "నా అనుజ్ఞలేకుండా మళ్లీ యిట్లావస్తుందా?" అని తనలో అనుకుని మండిపడ్డాడు. చీలుద్దామా అనుపించింది. కాని తలయెత్తి ఆమెవంక చూడనైనా చూడకుండా యెకాయెకిని ఆఫీసుకు వెళ్లాడు.

రాత్రి యింటికి వచ్చేటప్పటికి దీపము వెలుగుతున్నది. ఇల్లంతాకడిగి ముగ్గువేసివుంది. అదివరకు చెల్లాచెదరుగా పడివున్న సామానంతా యెక్కడిదక్కడ సరిగా అమర్చబడివుంది.

"వేన్నీళ్లు కాగినయి, స్నానం చెయ్యండి" అన్నది జానకి.

గిర్రునతిరిగి అతడు పడకటింటిలోకి వెళ్ళిపోయినాడు. ఆమెతో మాట్లాడదలచుకోలేదు.

తనపక్క పరచబడి ముడుతలు లేకుండా శుభ్రంగా వుంది. దానిమీద కూచున్నాడు.

జానకి గడపదాకా వచ్చి నుంచుని జంకుతూ "మీరు......" అని యేమో అనబోయింది.

"నేను హోటలులో భోంచేసివచ్చాను. పో" అని మొహం తిప్పుకున్నాడు భుజంగరావు. జానకి వెళ్ళిపోయింది.

అతని కేమీ తోచలేదు. ఇల్లు వదిలేసి యెక్కడికన్నా లేచిపోదామా అనుకున్నాడు. "మళ్ళీ యిదే దాపురించిందే! ఇది వదలదు" అనుకుని పక్కమీద పడుకుని కండ్లు మూసుకున్నాడు.

జానకి తలుపులన్నీ వేసి వస్తున్నట్లుగా చప్పుడు వినబడ్డది. అతడు కండ్లు తెరవలేదు. ఆమెవచ్చి దూరంగా చాపవేసుకుని కూర్చుంది. అతడు కదలలేదు. దీపను చిన్నదిచేసి పడుకుంది.

భుజంగరావుకు మెలకువలోనే యేవేవో కలలు వస్తున్నట్టుగా తోచింది. కండ్లుతెరిచి చూచాడు. జానకి తనవంకేచూస్తూ పడుకునివుంది.

మెల్లగా "ఎందుకు వచ్చావు?" అన్నాడు.

ఆమె మాట్లాడలేదు.

అతడు వేరేప్రక్కకు తిరిగి పడుకుని పూరుకున్నాడు. కాని మనస్సు నిలవలేదు. చివాలునలేచి వంటింటిలోకిపోయి మంచినీళ్ళకోసము వెతకసాగినాడు. జానకి లేచివచ్చి తన చేత్తోనే యిచ్చింది.

"నిన్ను రమ్మని రాయలేదు గదూ?" అని ఆమె భుజముమీద చెయివేసి ప్రశ్నించాడు.

జానకికి కళ్ళనీళ్లు గిర్రున తిరిగినవి. అతని రొమ్ముమీద తలఆనించి వెక్కి వెక్కి యేడవటం మొదలుపెట్టింది.

భుజంగరావు ఆమెను చేయిపట్టుకొని మెల్లగా తీసుకువెళ్లాడు. తన పక్కమీద కూర్చుని ఆమె రెండు భుజములమీద చేతులువేసి "ఏడవ్వాక" అన్నాడు.

*　　　*　　　*　　　*

"ఎనిమిది గంటలయిందండీ" అని భార్యమాట వినపడితే లేచి కూర్చున్నాడు భుజంగరావు. కిటికీలోనించీ సూర్యకిరణాలు వచ్చి పక్కమీద పడుతున్నవి.

కుమారుడు తండ్రిని మలేరియానుండి రక్షించాడు

శ్రీయుత కె.వి. అయ్యర్, మదరాసు. ఇలా వ్రాస్తున్నారు. మలేరియా జ్వరం తీవ్రంగా తగిలి శల్యావశిష్టుని చేసింది. అన్నంచూస్తే డోకువచ్చేది. నేను తేరుకోలేనని మాకుటుంబమంతా భయపడింది. మాకు దగ్గరగా డాక్టరున్నది 15 మైళ్లదూరంలో. అయినా నా కుమారుడు డాక్టరు సలహాకు వెళ్లాడు. మరునాడు ఉదయం అతడొక పెద్ద హార్లిక్సు బాటలుతో తిరిగివచ్చాడు. మూడు రోజుల్లోనే నాకు కొంచం బలము వచ్చింది. నా బరువెక్కువైంది; ఆకలి పుట్టింది. నేడు నేను పరిపూర్ణమైన బలము ఆరోగ్యంతో వుంటున్నాను. హార్లిక్సుకూ దాన్ని తెచ్చిన నాకుమారునికీ కృతజ్ఞుడుగావున్నాను.

మిస్టర్. కె.వి. అయ్యర్, మదరాసు.

ఈదినమే హార్లిక్సు కొనండి—అన్నిచోట్ల దొరకును.